నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, సోమవారం 15 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET




మామిడి పేరు చెబితేనే టక్కున గుర్తొచ్చేది కొల్లాపూర్, వనపర్తి.. ఇక్కడి రైతులు తోటలను విస్తారంగా పెంచుతుంటారు. ఇక్కడ పండే మామిడి పండ్లను చూస్తే నోరూరాల్సిందే.. రుచికరమైన ఫ్రూట్స్‌కు ఈ ప్రాంతం పేరొందింది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా మామిడి తోటలే కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో పండే పండ్ల కోసం ఎందరో ఎదురుచూస్తుంటారు. విదేశాలతోపాటు జాతీయ స్థాయిలో ఇక్కడి పండ్లు గుర్తింపు పొందాయి. అయితే ఈ తోటలు సాగు చేసిన రైతులకు మంచి రోజులు రాబోతున్నాయి. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ)కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. దేశంలోని 11 రాష్ట్రాల్లో బాగా పండించే పంటలను గుర్తించి వాటిని విదేశాలకు ఎగుమతి చేసేలా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. గతేడాది నవంబర్ చివరి వారంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ ప్రాజెక్టు జిల్లాలో ప్రారంభం కావాల్సి ఉండగా.. ఎన్నికల కోడ్‌తో అమలుకు నోచుకోలేదు.

*- వనపర్తి, జూన్ 14 (నమస్తే తెలంగాణ)*

# మామిడికి మంచిరోజులు

**ఏడు ఉద్యాన పంటలకు గుర్తింపు**

దేశంలోని 53 ఉద్యాన సమూహాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మొదటి దశగా పైలట్ బేసిన్‌లో ఏడు ఉద్యాన పంటలను ఎంపిక చేసింది. దేశ వ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 12 జిల్లాల్లో పండే యాపిల్, మామిడి, అరటి, ద్రాక్ష, పైనాపిల్, దానిమ్మ, పసుపునకు కేంద్రం ఈ పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట) మామిడిని ఎంపిక చేసి మెగా క్లస్టర్‌గా గుర్తించింది. అయితే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 57 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నట్లు ఉద్యాన శాఖ రికార్డులు చెబుతున్నాయి. కాగా, వీటికి అదనంగా మరో 20 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నట్లు అనధికార అంచనా.. అధికంగా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనే మామిడి తోటలు విస్తారంగా సాగు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా 2.30 లక్షల టన్నుల మామిడి దిగుబడి ఉంటుందని ఉద్యాన శాఖాధికారుల అంచనా.

**రూ.200 కోట్లతో అభివృద్ధి..**

కేంద్ర ప్రభుత్వం మామిడి రైతులను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో సీడీపీ (క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)కు అడుగులు వేస్తున్నది. ఇందుకోసం కేంద్రం రూ.100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం అమలుకు ప్రసాద్ సీడ్స్ ఏజెన్సీని ఎంపిక చేయగా.. ఈ కంపెనీ సైతం మరో రూ.100 కోట్లను మామిడి అభివృద్ధికి జత చేయనున్నది.



ఇలా ఈ ప్రాజెక్టు అప్రూవల్ అయిన పలు దఫాలు శిక్షణలు సైతం పూర్తి చేశారు. అయితే, ఉమ్మడి జిల్లాలో మామిడి తోటలను పెంచిన దాదాపు 18,800 మంది రైతులను ఈ పథకంలో భాగస్వాములను చేయనున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) ద్వారా దేశంలోని ఏడు రకాల పంటల సాగు విస్తీర్ణం.. దిగుబడులను పెంచడం, విదేశాలకు ఎగుమతులు.. సదుపాయాలు కల్పించి మంచి ధర వచ్చేలా ప్రోత్సాహం అందించనున్నారు.

**నాలుగేండ్లపాటు ప్రాజెక్టు..**

నూతనంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు కాలపరిమితి నాలుగేండ్లుగా నిర్ణయించారు. గతంలో మామిడి సాగు చేసిన తోటలను పునరుద్ధరించడంతోపాటు కొత్త తోటల ఏర్పాటును సబ్సిడీతో ప్రోత్సహించనున్నారు. స్థానికంగానే మామిడి నర్సరీలు ఏర్పాటు చేయడం, కోల్డ్ స్టోరేజ్, మామిడి పండ్ల శుద్ధి యూనిట్, ప్రత్యేక ప్యాకింగ్ సిస్టం, కాయలను మాగబెట్టేందుకు గదులు, వేడినీటితో మామిడిని శుభ్రం చేసే ట్రీట్‌మెంట్స్ జరిగేలా చర్యలు తీసుకోబోతున్నారు. వీటితోపాటు రైతులకు మామిడి సాగులో మెళకువలు, దిగుబడులు సాధించే చర్యలు, విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన మెళకువలను రైతులకు నేర్పించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. కొత్తగా మొక్కలు నాటేందుకు కూడా రైతులకు రాయితీలు ఇచ్చి నాలుగేండ్లపాటు ప్రోత్సాహం అందించనున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచి, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, ఆధునిక పద్ధతులను అవలంబించేలా రైతులకు ప్రోత్సాహం అందిస్తారు. ప్రస్తుతం వస్తున్న నష్టాలను నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం, విరివిగా రాయితీలను అందించడంతో రైతులకు సహకరిస్తారు. ప్రపంచ మార్కెట్లో ఎగుమతుల పోటీని పెంచడం కోసం నూతన విధానాలను వివరిస్తూ ఆదాయం పెంచేలా శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతారు.

- క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లా ఎంపిక
- మెగా క్లస్టర్‌గా రూ.200 కోట్లతో కార్యాచరణ
- నాలుగేండ్లపాటు నిర్వహణ
- విదేశాలకు ఎగుమతులపై ప్రత్యేక దృష్టి
- దేశంలో 11 ప్రాంతాల వారీగా గుర్తింపు
- కొల్లాపూర్, వనపర్తి మామిడి రైతులకు లాభాలే..

### మామిడి మహారాజే..

అన్ని పండ్లకంటే మామిడి మహారాజు. మ్యాంగో సీజన్ వచ్చిందంటే, మిగతా పండ్ల వ్యాపారం తగ్గిపోతుంది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న మామిడికంటే ఉమ్మడి పాలమూరు మామిడికి ఏదీ సాటి రాదు. అందుకే ఈ ప్రాంత పండ్లను ప్రత్యేకంగా గుర్తించారు. ఉన్న తోటలను అభివృద్ధి చేయడం.. కొత్త వాటిని ఏర్పాటు చేయడం, మామిడికి అవసరమైన అన్ని చర్యలు తీసుకొని రైతులను ప్రోత్సహించాలన్నదే సీడీపీ పథక లక్ష్యం. ప్రధానంగా విదేశాలకు ఎగుమతులను చేపట్టి మంచి ధరలను వచ్చేలా నాలుగేండ్లపాటు రైతులకు అండగా ఉండి లాభాలను చేతికి అందిస్తారు. మామిడి తోటలను తొలగించవద్దు.. మంచి ఫలితాలు ఉంటాయి..



*- సురేశ్, ఉద్యానశాఖ జిల్లా అధికారి, వనపర్తి*





నాగర్‌కర్నూల్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పద్మావతి బంగారయ్య, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్‌ఇసాక్ ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును హైదరాబాద్‌లోని నందినినగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు సంబంధించి పలు విషయాలపై ఆయన చర్చించారు.

## బీసీల హక్కులను సాధించుకుందాం



ధిక్కార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

- బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు జూలూరి గౌరీశంకర్

పాలమూరు, జూలై 14 : బీసీల హక్కులు సాధించుకునేందుకు విద్యావంతులు, కవులు, రచయితలు బహుజన ఉద్యమ రూపకల్పన చేయాల్సిన అవసరమున్నదని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ అన్నారు. ఆదివారం పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని లుంబినీ పాఠశాలలో ధిక్కార కవితా సంకలన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయపోరాటానికి ఉప కులాలన్నింటినీ ఓటు యంత్రాలుగా మార్చి 77ఏండ్లుగా కొందరు మాత్రమే పాలిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అందుకు కట్టుబడి ఉండాలని, లేదంటే తగిన గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం ధిక్కార పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత బెక్కం జనార్దన్, కవి లక్ష్మణ్‌గౌడ్, పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్, పుస్తక సంపాదకులు వనపట్ల సుబ్బయ్య, కొప్పుల యాదయ్య, ఖాజామైనొద్దీన్, గన్నోజు శ్రీనివాసాచారి, విఠలాపుర పుష్పలత, కర్నాటి రఘురాములుగౌడ్, అంబటి భానుప్రకాశ్‌తోపాటు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ టోర్నీ విజేత పాలమూరు



పాలమూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గుణ

- ముగిసిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల టోర్నమెంట్

కల్వకుర్తి, జూలై 14 : కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 10వ రాష్ట్ర స్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో మహబూబ్‌నగర్–నిజామాబాద్ జట్లు పాల్గొనగా, 1–0 గోల్ తేడాతో నిజామాబాద్ జట్టుపై మహబూబ్‌నగర్ విజయం సాధించింది. తృతీయ స్థానంలో ఖమ్మం, నల్లగొండ జట్లు నిలిచాయి. విజేత, రన్నర్ జట్లకు ట్రోఫీలను ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గుణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో క్రీడాకారులకు కొదవ లేదన్నారు. ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లే సత్తా ఉందని ఆయన పేర్కొన్నారు. అమ్మాయిలకు ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడలతోపాటు చదువు కూడా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి పాండు, యాదయ్యగౌడ్, వెంకటేశ్, గజానంద్, రాజేందర్, విజయభాస్కర్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్నమాస్టర్లు

కొత్తకోట, జూలై 14 : జాతీయ స్థాయి తైక్వాండో పోటీలను ఈనెల 12 నుంచి 14వరకు కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఓపెన్ చాంపియన్‌షిప్ ఇండియా స్పోర్ట్స్, తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–13, అండర్–26 కేజీల విభాగంలో సయ్యద్ అహ్మద్, జాఫర్ బంగారు పతకాలు సాధించినట్లు గాడ్స్ ఆన్ వారియర్స్ కరాటే క్లబ్ మాస్టర్ ఎస్‌కే నబీ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

## ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పూడికతీత



ఆర్డీఎస్ కాల్వలో డోజర్‌తో పూడికతీత పనులు చేయిస్తున్న ఏఈ రాందాస్

- రూ.36లక్షల వ్యయంతో పనులు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే నిధుల మంజూరు

అయిజ, జూలై 14 : ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పూడికతీత తొలగింపు పనులు చేపడుతున్నారు. 2022–23 సంవత్సరంలోనే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ.36లక్షలు విడుదల చేసి పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. గతేడాది పూడికతీత, ముళ్లకంప తొలగింపు పనులు చేపట్టడంలో ఆలస్యమైంది. ఈ ఏడాది పనులు చేపట్టాలని అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయడంతో ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పేరుకుపోయిన మట్టి, కాల్వకు ఇరువైపులా ముళ్లకంప తొలగింపు పనులు ముమ్మరం చేశారు. తెలంగాణ సరిహద్దులోని సింధనూర్ హెడ్ రెగ్యులేటర్ నుంచి డీ–19ఈ డిస్ట్రిబ్యూటరీ వరకు ప్రధానకాల్వలో పనులు జోరుగా చేపట్టారు. జూలై చివరి నాటికి పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు, డిస్ట్రిబ్యూటరీ మరమ్మతులు పూర్తి చేసి వానకాలంలో పంటలకు సాగునీరు సాఫీగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఎస్ ప్రాజెక్టు ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## యువతకు అధిక ప్రాధాన్యం

- స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలి
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దాం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 14 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో యువతకు ప్రాధాన్యం కల్పించేందుకు పార్టీ నిర్ణయం తీసుకున్నదని, కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో బీఆర్‌ఎస్ యువత, విద్యార్థి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 30శాతం సీట్లు యువ నాయకులకు కేటాయించి భావితరానికి నాయకులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. స్వార్థపరులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారని, వారికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సంక్షేమ పథకాలకు ఎగనామం పెడుతున్నారని మండిపడ్డారు. యువతకు 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి, పది పాసైన వారికి రూ.10వేలు, డిగ్రీ చదువుకు రూ.25వేలు, విద్యార్థి భరోసా కింద రూ.5లక్షల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ప్రజలకు వివరించాలన్నారు. అభిప్రాయ సేకరణతో రైతులను నట్టేట ముంచాలని కాంగ్రెస్ చూస్తున్నదన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలను తులం బంగారం, మహిళలకు రూ.2,500 నగదు, కేసీఆర్ కిట్టు, గ్యాస్ సబ్సిడీ, విద్యార్థినులకు స్కూటీలపై నిలదీస్తున్నారని చెప్పారు. హామీల అమలు కోసం నిర్మాణాత్మక ఉద్యమాలు చేస్తామన్నారు. 14ఏండ్ల ఉద్యమం చేసి శూన్యంలో సునామీ సృష్టించిన కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో ఎందరో యువ నాయకులను తయారు చేశారని గుర్తుచేశారు. అలాగే కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను నాయకులుగా తయారు చేస్తామన్నారు. ప్రతి మండలంలోని యువ, విద్యార్థి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి యువశక్తిని తయారు చేస్తామన్నారు.

సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు విజయ్‌కుమార్, నందిమల్ల అశోక్, మన్యం, యువత అధ్యక్షుడు గిరి, రాము, హేమంత్, కార్తీక్, జోహెబ్, అఖిలేందర్, యుగంధర్‌రెడ్డి, రఘు, పుష్పక్, సురేశ్, రవి, సుబ్బు, సునీల్, యాదగిరి, శివ, గోవిందు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటికను పరిశీలిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే

### ఆపదలో అండగా ఉంటాం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

మానవపాడు, జూలై 14 : ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలంలోని చిన్నపోతులపాడు, చెన్నిపాడు, మద్దూరుకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. మద్దూరుకు చెందిన లక్ష్మన్న, రాజు, చెన్నిపాడుకు చెందిన మాదిగ రాజు, అలీంబీ, పోతులపాడుకు చెందిన మాదిగ నాగరాజులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే బాధితుల ఇంటికి స్వయంగా వెళ్లి చెక్కులను అందజేశారు. అండగా ఉంటామని కుటుంబాలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకుడు రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు .అదేవిధంగా మండల కేంద్రంలోని మైనార్టీ శ్మశానవాటికలో ముళ్లకంప తొలగింపును ఆయన పరిశీలించారు. శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఆయన వెంట ముతవలీ మహబూబ్ బాషా, అన్వర్ పాల్గొన్నారు.

### చిట్టెం కృషితోనే మక్తల్‌కు కోర్టు మంజూరు



చిట్టెంను సన్మానిస్తున్న న్యాయవాదులు


మక్తల్, జూలై 14 : మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషి ఫలితంగానే మక్తల్‌లో కోర్టు ఏర్పాటు అయ్యిందని న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, విల్సన్, ఖాజామైనొద్దీన్ తెలిపారు. మక్తల్ కోర్టు ఏర్పాటు సందర్భంగా ఆదివారం చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో 21–05–2022న అప్పటి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతిని కలిసి కోర్టు ఏర్పాటునకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, అదే సంవత్సరంలో 2022 డిసెంబర్ 23న ఎల్‌టీఆర్వోసీ నెంబర్ 321/ ఈ1/ 2022 జీవోతో మక్తల్‌కు కోర్టును మం జూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా జాప్యమైందన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి కోర్టు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వానికి న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్ గుప్తా, చిన్నహన్మంతు, గవినోళ్ల నర్సింహారెడ్డి, ఈశ్వర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మార్మోగిన జగన్నాథుడి రథయాత్ర

- పూజలు చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ డీకే అరుణ



జగన్నాథుడి రథయాత్రకు భారీగా హాజరైన భక్తులు



హారతి ఇస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, జూలై 14 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నుంచి శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొత్తబస్టాండ్, అశోక్‌టాకీస్ చౌరస్తా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా, రాంమందిర్ నుంచి గడియారం చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, రైల్వేస్టేషన్ రోడ్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రథయాత్ర సందర్భంగా వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. జగన్నాథుడి నామస్మరణతో పాలమూరు పట్టణం మార్మోగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం 56రకాల వంటకాలతో తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో జగన్నాథ రథయాత్ర కమిటీ సభ్యులు యాదిరెడ్డి, రాజమల్లేశ్, ఉదయశ్రీ, వినయ్‌కుమార్, కొండన్న, మల్లారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, సుధాకర్, నత్మల్‌రఘువార్, రఘు, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ధరూరు, జూలై 14: ఎగువన, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు జూరాల ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 3,413 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 3.920 టీఎంసీల నీటి మట్టం కలిగి ఉన్నది. పైనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 528 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులను ప్రాజెక్టు అధికారులు వదులుతుండగా.. మొత్తం 1,778 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.



జూరాలలో ప్రస్తుత నీటిమట్టం